


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**80**

**(8‘ నవంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**హైదరాబాదు నగరంలో** నాకో యువక పుంగవునితో పరిచయమైంది. చాలా సరదాగలవాడు. కళల మీద అభిమానం వుంది. ఒక పూట హరికథ చెపుతాడు - ఒక పూట బుర్రకథ వినిపిస్తాడు.

ఊరికే అటూ ఇటూ తిరుగుతున్నప్పుడుకూడా పెదిమలతో మద్దెల చప్పుళ్ళు చేస్తూనే ఉంటాడు. ఈ అన్నిటితోపాటు భగవంతుడతనికి భావప్రకటనకు అనుకూలమైన ముఖం ప్రసాదించాడు. అందులో మళ్ళీ కొంత వింతరూపం కూడా వుంది. ఏటవాలు ముఖం - కోటేరు ముక్కు.

ఊరికే కూర్చోకుండా ఉద్యోగం చేస్తున్నాడు. ఆఫీసుకి వెళ్ళడమంటే పూర్వం అండమానులకు వెళ్ళేవాళ్ళ ముఖం పెడతాడు. కానీ వెళ్ళడం మాత్రం మానడు. మానితే మరి అన్ని కళల్ని ప్రదర్శించే ఉత్సాహం ఎలా వస్తుంది?

***ట్రంకు పెట్టెలో పిచ్చుకల కిచకిచ***

ఇంటిదగ్గర నుంచి తెచ్చుకున్న పూర్వపు ట్రంకుపెట్టెలో పది పిచ్చుకలు కిచకిచమంటేగా - ఆ హుషారు పైకి తన్నేది. అందుకని పిచ్చుకగూడు బాగానే చూసుకుంటాడు. ఏ సినిమాకో బయలుదేరితే తప్ప - ఒక్క పిచ్చుకను బయటికి పోనియ్యడు. వాటిని పెద్ద గుంపుచేసి ఇంపుగా, సొంపుగా జీవితం దిద్దుకోవాలని ఆయనగారి అభిలాష.

ఎవరైనా ఆ పిచ్చుకల మాట ఎత్తితే వాటిని బయటికి తియ్యమంటారేమోనన్న భయంతో "లేవు గురూ! అన్నీ ఎగిరిపోయాయి. ఎలా పోతున్నాయో, తుర్రున ఎగిరిపోతున్నాయి. ఫస్టు తారీఖుకి గాని గూట్లో అవి ఉండేది. రెండు రోజులే గురూ. ఏం చేస్తాం?" అని నొసటిమీద కుడిచేతి నాలుగు వేళ్ళతో కొట్టుకుంటూ, విచారం ప్రకటిస్తాడు.

వాటిమాట ఎత్తకపోతే మంచి దిటవుగా, ధీరుడుగా, కళాకారుడుగా, గాయకుడుగా - మన యోగక్షేమాల కోసం తాపత్రయపడే దయాంతరంగడుగా సాక్షాత్కరిస్తాడు. మనల్ని మురిపించడానికి ప్రయత్నిస్తాడు. ఎన్ని విధాలుగానో తన తడాఖా చూపిస్తాడు.

ఎవరైనా పొగుడుతుంటే సంబరాలు పడతాడుగాని - రవ్వంత అయినా లొంగడు. తన స్వప్రయోజనానికి దూరమైన విషయం వచ్చినప్పుడు - అంతటి కలుపు కట్టు మనిషి ‘గడవాసం‘లాగా నిలబడిపోతాడు.

***పరోపకారంలో పరమనైష్ఠికుడు***

ఎన్నో కబుర్లు చెపుతూ ఉంటాడు. ఎన్నో సామెతలందిస్తూ ఉంటాడు. రాగాలు తీస్తాడు. లాస్యం చేస్తాడు తనలో తనే సృష్టిగా నవ్వేస్తాడు. భేషుగ్గా ఫోజు పెట్టేస్తాడు. పరోపకారం విషయంలో ‘పరమ నైష్ఠికుడు - తక్కిన సమయాలలో ‘అతి దాష్టికుడు‘

అర్ధరాత్రికాడ లేచి కూర్చుని అద్భుతంగా భజన చేస్తాడు. ఉండి ఉండి మూడో కాలంలోకి పోతూవుంటాడు. చటుక్కున దిగిపోతూ వుంటాడు. తాళాలతోపాటు ముఖంలో కవళికలు కూడా మారుస్తూ ఉంటాడు. అన్నట్లు ఆ మిత్రుని వ్యవహార నామం -

"ఉంజయుడు" - అసలు పేరు మృత్యుంజయుడు. పొట్టి తనం కోసం అది అలా మార్పు చేయబడింది. అందరూ 'ఉంజయా' అని పిలుస్తారు. చాలామంది "ఈయనగారికేం సంజయుడంతటివాడు" అంటూ ఉంటారు.

నగరంలో ఆయనకు చాలామంది మిత్రులున్నారల్లే ఉంది. ఉంజయుడున్నాడా? అని ఎప్పుడూ ఫోనులు వస్తూనే ఉంటాయి. మొన్న ఒకరోజున రాత్రి పదకొండుగంటలకు ఫోను వచ్చింది. ఆయన నిద్రపోతున్నాడు.

"ఇప్పుడు ఫోను చేశారేమిటి? అంత అర్ధరాత్రివేళ." అంటే -

"ఒకవేళ ఇవ్వాళ వోటీకి వెళ్ళివచ్చావేమోనని పిలిచాను" అన్నాడా పెద్దమనిషి, ఉంజయుడు ఓటీలు ఎక్కువగా చేస్తూ ఉంటారు. ఆఫీసు టైం అయిన తర్వాత పని చెయ్యడం వోటీ కదా మరి.

ఉంజయుడు వోటీల ప్రియుడు. ఆయన అంటూ ఉంటాడు. "వో.టిలనుకోకుండా కొత్తపిచ్చుకలు వచ్చి గూట్లో చేరుతూ ఉంటాయండి. అసలు వాటి అందమే వేరు. తళతల మెరిసిపోతూ ఉంటాయి. ఆ కిచకిచల్లో కీర్తనలు వినిపిస్తాయి. ఎంత మధురం? ఎంత ఆనందం?" అని.

చాలా హాస్యం ఉంది ఆయనలో. ప్రతి క్షణం ఏదో ఒక కవ్వింపూ, కవ్వింపూ ఉంటుంది. ఏవో కొత్త ఉపమానాలు, మాటలు విసురుతూ ఉంటాడు. ఏదో మాట సందర్భం వచ్చి ఒకనాడు అంటున్నాడు "అలాటి పనిచేస్తే ఊరుకుంటారా? చందాలు వేసుకుని చావగొడతారు" అని. ఈ పదం తర్వాత కూడా చాలాసార్లు వాడటం జరిగింది. ఆయన ప్రత్యేక హాస్య వచనాల్లో ఇది ఒకటి.

ఆయనగారికి కొంచెం పొగడ్తలు అవసరం. అలాటి సమయం వచ్చినప్పుడు మనిషి ఉబ్బిపోతూ ఉంటాడు. మధ్య మధ్య అనుమానం వచ్చి "మీరు హాస్యంగా మాట్లాడుతున్నారా నిజమా?" అని ప్రశ్నిస్తూ ఉంటాడు. నిజమేనని చెప్పిన తర్వాత

***అర్జంటుగా ఆరుపౌనులు పెరిగాను.***

"అలా అయితే సంతోషం. మీకు తెలుసో లేదో నేను ఈ క్షణంలో అర్జంటుగా ఆరుపౌనులు పెరిగిపోయాను. చూడండి ఎలా ఉన్నానో!" అని ధీమాగా చెపుతూ ఉంటాడు.

సినిమాలంటే అమిత సంతోషం. దానితోపాటు బలంకూడా అప్పటికప్పుడు అర్జెంటుగా వస్తుంది. ఆ పరుగు వేరు ఆ సంబరం వేరు. రాజబాబు అంటే ఎంతో మోజు. ఆయన హాస్యమంతా 'తాజాసరుకు' అని చెప్పి సంబరాలు పడుతూ ఉంటాడు.

తను కూడా సినిమాలలో చేరి శక్తి సామర్థ్యాలు ప్రదర్శించాలనే కుతూహలం ఎక్కువగా ఉంది. కానీ, "ఉన్న ఉద్యోగం ఊడిపోతే ఈ ఉంజయుడు పని ఏమవుతుంది. కనీసం రాజబాబు చిత్రాలు చూసేందుకైనా చేతులో పైసలుండవు."

స్టార్‌కి కావలసిన నైపుణ్యం సరిపడ్డంత స్టోరులో వుందిగానీ అంతగా అవసరమైతే వాడుకునేందుకు కావలసిన కరెన్సీ స్టాక్ లేదు అంటూ ఉంటాడాయనగారు.

"ఏ ప్రొడ్యూసరైనా పిలిచి పది పిక్చర్లను ఒక్కమాటే కాంట్రాక్టు వ్రాస్తే అప్పుడు బురఖా మార్చేస్తాను, నా తడాఖా చూపించేస్తాను. మన నటనంటే మాటలనుకున్నారేంటండి?" అని మధ్యలో యాసంలోకి దిగి మనల్ని హాస్యంలో ముంచి తేల్చడానికి ప్రయత్నిస్తూంటాడాయన.

***టైపిస్టు కాపిటలిస్టుగా మారాలి.***

"మీ ఆశయం గొప్ప హాస్యనటులుగా రూపొందాలనేనా" అని ప్రశ్నిస్తే ఆయనగారదోవిధంగా ముఖకవళికలు మార్చి "స్టార్‌ను" కావాలనే కోర్కె ఉందనుకోండి. అసలు కోరిక ఏమిటంటే ఈ టైపిస్టు ఒక కాపిటలిస్టు కావాలని మన కీర్తి మవుంట్ ఎవరెస్టు ఎత్తున పెరగాలని - అంటూ ధీమాగా మాట్లాడారు.

"కాపటలిష్టులు తెర వెనక్కి పోయే ఈ కాలంలో మీరు ఆ హోదా కోసం ప్రయత్నించడం ఏమిటి?" అని ప్రశ్నిస్తే "కాపిటలిస్టు అనే పదం ఎక్కడికి పోతుందండీ? ఉన్న వాళ్ళల్లో ఎక్కువ మొత్తం ఎవరి దగ్గర వుంటుందో అతడే కాపిటలిష్టు" అని ఆయన నిర్వచించాడు.

మొత్తానికి ఉంజయుడుగారు, ఊహలు కల వ్యక్తి. ఉత్సాహం ఎక్కువ. ఈ కాలాన్నిబట్టి బ్రహ్మచారిగా ఉండటంలోనే ఎక్కువ "ఎడ్వాన్టేజ్" ఉన్నదని భావించి సంబరాలు పడే యువకుడు. తన 'సుఖం కోసం' ప్రపంచాన్ని మరిచిపోగల ప్రతిభావంతుడు.

అన్నట్టు ఉంజయుడు భక్తుడు కూడా. ఈ మధ్య ఎవరో కొనుక్కున్న తావళం ఒకటి చేతపట్టాడు. పూసలు తిప్పుతూ పుణ్యలోకాలు దర్శిస్తూ ఉంటాడు. బహుముఖ ప్రజ్ఞులుగల బ్రహ్మచారి.

Post your comments